RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 311 | సంపుటి 4 | సోమవారం | 17-08-2026 | పేజీలు 4 | వెల 3/-


ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374




అధికారుల నిర్లక్ష్యంతో

# రూ.90 కోట్లు సీఎంఆర్ బకాయిలు

- డిఫాల్ట్ రైస్ మిల్లర్ల ఆగడాలు మితిమీరిన వైనం
- ముఖ్యమంత్రి ఆదేశాలూ బేఖాతర్ .. డెడ్‌లైన్ దాటినా కదలని అధికారులు
- మహబూబాబాద్ జిల్లాలో 25 మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిలపై నిశ్శబ్దం
- రూ.90 కోట్లలో ఇప్పటివరకు సుమారు రూ.16.30 కోట్లు మాత్రమే రికవరీ

*ప్రభుత్వానికి రావాల్సిన రూ.90 కోట్ల బకాయిల వ్యవహారంలో ఇప్పటివరకు సుమారు రూ.16.30 కోట్లు మాత్రమే రికవరీ కాగా, మిగిలిన మొత్తాన్ని ఎప్పుడు, ఎలా వసూలు చేస్తారన్నది ఇప్పుడు కీలకంగా మారింది. డెడ్‌లైన్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఆస్తుల జప్తు, చట్టపరమైన చర్యలు వంటి కఠిన చర్యలు చేపడతారా? లేక మరోసారి గడువు పొడిగించి వ్యవహారాన్ని నాన్చుతారా? అన్నది వేచి చూడాల్సిందే. ప్రభుత్వానికి చెందాల్సిన ధాన్యం.. ప్రజలకు చేరాల్సిన బియ్యం.. కోట్ల రూపాయల విలువైన బకాయిలు. ఈ వ్యవహారంలో మిల్లర్ల బాధ్యత ఎంత? అధికారుల పర్యవేక్షణ ఎంత? చివరకు ప్రజలకు నష్టం ఎంత? అన్నదానిపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.*

మహబూబాబాద్, ఆగస్టు 16(ప్రభాత గమనం):

ప్రభుత్వానికి చెల్లించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిల విషయంలో మహబూబాబాద్ జిల్లాలో పరిస్థితి రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో డిఫాల్ట్‌గా ఉన్న రైస్ మిల్లర్ల నుంచి సుమారు రూ.90 కోట్ల విలువైన ధాన్యం/బకాయిలు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా, ఇప్పటివరకు అధికారులు సుమారు రూ.16.30 కోట్ల మేర మాత్రమే రికవరీ చేసినట్లు సమాచారం. మిగిలిన భారీ మొత్తంపై చర్యలు ఎక్కడ ఆగిపోయాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సివిల్ సప్లై అధికారుల సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. డిఫాల్ట్ పరిధిలో ఉన్న రైస్ మిల్లర్లను పిలిపించి బకాయిల వసూళ్లపై చర్చించాలని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆస్తుల జప్తు వంటి చర్యలకు కూడా వెనుకాడవద్దని ఆయన సూచించినట్లు తెలుస్తోంది.అంతేకాకుండా జిల్లా కలెక్టర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి బకాయిలను చెల్లించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. బకాయిలు చెల్లించకపోతే కఠిన చర్యలు తప్పవని పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, కొందరు డిఫాల్ట్ రైస్ మిల్లర్లలో మాత్రం పెద్దగా చలనం కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సీఎంఆర్ బకాయిల వసూళ్లకు ప్రభుత్వం ఆగస్టు 5వ తేదీని డెడ్‌లైన్‌గా విధించింది. ఆ తేదీలోగా ప్రభుత్వానికి బకాయిలు ఉన్న మిల్లర్లు ధాన్యం లేదా సంబంధిత మొత్తాన్ని చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే గడువు ముగిసి వారం రోజులు దాటినా మహబూబాబాద్ జిల్లాలో మిగిలిన భారీ బకాయిలపై ఇప్పటివరకు ఎలాంటి పెద్ద స్థాయి చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం ఒకవైపు డెడ్‌లైన్ విధించడం, మరోవైపు కఠిన చర్యలకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం బకాయిల వసూళ్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడం పౌరసరఫరాల శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.మహబూబాబాద్ జిల్లాలో సీఎంఆర్ బకాయిల సమస్య ఇప్పటిది కాదు. 2021-22 రబీ సీజన్ నుంచి 2022-23 ఖరీఫ్, 2023-24 ఖరీఫ్ సీజన్లలో ప్రభుత్వానికి సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన ధాన్యాన్ని కొందరు రైస్ మిల్లర్లు పూర్తిస్థాయిలో అందించలేదని సమాచారం. ఆ సమయంలో అధికారులు కొంతమేర రికవరీ చేపట్టినప్పటికీ, మరికొంతమంది మిల్లర్ల నుంచి రావాల్సిన ధాన్యం, నగదు బకాయిలు అలాగే మిగిలిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ ఈ బకాయిల మొత్తం భారీగా పెరిగింది. చివరకు ప్రభుత్వం డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.బకాయిల వసూళ్లలో భాగంగా 2024లో పౌరసరఫరాల శాఖ అధికారులు సుమారు 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసినట్లు సమాచారం. ఈ వేలంలో మొత్తం 45 మంది రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.అయితే ఇందులో కేవలం 15 మంది మిల్లర్లు మాత్రమే సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన 25 మంది మిల్లర్ల నుంచి సుమారు 40,758.018 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువకు సంబంధించిన బకాయిలు ఇంకా వసూలు కావాల్సి ఉంది.ఈ బకాయిల విలువ సుమారు రూ.90 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంటే ప్రభుత్వ ధాన్యం తీసుకున్న తర్వాత కూడా ధాన్యం తిరిగి ఇవ్వకపోవడం, నగదు చెల్లించకపోవడం వల్ల ప్రజాధనం భారీగా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది.ఇటీవల పౌరసరఫరాల శాఖ అధికారులు, అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో డిఫాల్ట్ మిల్లర్లపై తనిఖీలు, దాడులు చేపట్టారు. ఈ చర్యల నేపథ్యంలో సుమారు రూ.90 కోట్ల బకాయిల్లో రూ.16.30 కోట్ల వరకు వసూలు చేయగలిగినట్లు సమాచారం. అయితే ఇంకా దాదాపు రూ.84 కోట్ల మేర బకాయిలు మిగిలి ఉండటంతో అసలు రికవరీ ఎప్పుడు పూర్తవుతుందన్నది ప్రశ్నగా మారింది. ప్రభుత్వ ఆదేశాలు, అధికారుల హెచ్చరికలు ఉన్నప్పటికీ మిగిలిన మొత్తాన్ని వసూలు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.సీఎంఆర్ చెల్లించని మిల్లర్లపై చర్యల్లో భాగంగా మహబూబాబాద్‌లో అధికారులు ధాన్యాన్ని వేలం వేశారు. వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న పలువురు రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి నగదు చెల్లించడంలో వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ధాన్యం వేలం వేయడం వరకు చర్యలు తీసుకున్న అధికారులు.. వేలంలో ధాన్యం దక్కించుకున్న వారి నుంచి డబ్బు ఎందుకు పూర్తిస్థాయిలో వసూలు చేయలేకపోతున్నారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ప్రజాధనం విలువ తగ్గిపోవడంతో పాటు ప్రభుత్వ ధాన్యం నిర్వహణపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఎంఆర్ బకాయిల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. డిఫాల్ట్ మిల్లర్ల నుంచి బకాయిలను రికవరీ చేయడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ఇప్పటికే మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినా.. భారీ మొత్తంలో బకాయిలు ఇంకా వసూలు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి, మిల్లింగ్ చేయించి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు బియ్యం అందిస్తుంది. ఈ మొత్తం ప్రక్రియలో రైస్ మిల్లర్ల పాత్ర కీలకం. అలాంటి వ్యవస్థలో ప్రభుత్వ ధాన్యం తీసుకున్న మిల్లర్లు సీఎంఆర్ బియ్యం లేదా దానికి సమానమైన ధాన్యాన్ని తిరిగి ఇవ్వకపోతే దాని భారం చివరకు ప్రభుత్వంపైనే పడుతుంది.మహబూబాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడి బకాయిలు పేరుకుపోవడానికి అసలు కారణం ఏమిటి? బకాయిలు చెల్లించని మిల్లర్లపై గతంలోనే ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదు? వేలంలో ధాన్యం దక్కించుకున్న తర్వాత కూడా చెల్లింపులు చేయని వారిపై ఏ చర్యలు తీసుకున్నారు? ఇంకా ఎంత మొత్తంలో ధాన్యం లేదా నగదు రికవరీ కావాల్సి ఉంది? ఈ ప్రశ్నలకు పౌరసరఫరాల శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. సీఎంఆర్ బకాయిలు ఒక్కరోజులో పేరుకుపోయినవి కావు. సంవత్సరాలుగా కొనసాగుతున్న వ్యవహారం కావడంతో గతంలో పర్యవేక్షణ చేసిన అధికారులు, ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు దీనిపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా బకాయిలు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం వెనుక కారణాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరపాలి.